క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు నెల జీతం బోనస్ ఇవ్వాలి

ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి సాంబశివరావు



వించిపేట(విజయవాడపశ్చిమ): విజయవాడ నగరాన్ని ముంచేసిన బుడమేరు వరదల్లో పగలు, రాత్రి శ్రమించిన పారిశుద్ధ్య కార్మికులకు ఒక నెల జీతం బోనస్‌గా చెల్లించాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 49వ డివిజన్ శానిటరీ కార్యాలయం వద్ద శుక్రవారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వారికి అందాల్సిన చెప్పులు, యూనిఫాం, సబ్బులు, ఆయిల్ సరఫరా చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు తెడ్డు వెంకటేశ్వరరావు, నగర నాయకుడు బుద్దె రాజా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జెక్కి జేమ్స్, తుపాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుస్తుల పంపిణీ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేఎల్ రావునగర్‌లో వరద ముంపునకు గురైన బాధితులకు నంద్యాల జిల్లా కోయిలకుంట్లకు చెందిన విక్కీ ఫౌండేషన్ నిర్వాహకుడు గోపిరెడ్డి శుక్రవారం కేఎల్‌రావునగర్‌లో వరద ముంపునకు గురైన బాధితులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివకుమార్ పట్నాయక్ సహకారంతో తాము ఈ దుస్తులను పంపిణీ చేశామన్నారు. కేఎల్‌రావు నగర్, వీఎంసీ కాలనీ, అంబేడ్కర్‌నగర్ పరిసరాల్లో ఉన్న కుటుంబాలకు ఈ దుస్తులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శివకుమార్ పట్నాయక్, బద్రీనాథ్, గుర్రం రాంబాబు, కిరణ్‌కుమార్ పట్నాయక్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖరరావు సేవలు అపూర్వం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూరపాటి పాఠశాల వ్యవస్థాపకుడు కూరపాటి చంద్రశేఖరరావు విద్యారంగానికి అందించిన సేవలు అపూర్వమని డీబీఎస్ బ్యాంక్ మేనేజర్ కొరివి సాయికిషోర్ అన్నారు. కూరపాటి చంద్రశేఖరరావు 109వ జయంతిని పురస్కరించుకుని ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ, ఉచిత నేత్ర వైద్య శిబిరం, పేదలకు చీరల పంపిణీ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అయాన్ నేత్ర వైద్యశాల వైద్యుడు డాక్టర్ బషీర్ అహ్మద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ గానుగుల యుగంధరాచార్య తదితరులు మాట్లాడారు.

జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు కేబీఎన్ విద్యార్థి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు తమ విద్యార్థి ఎం.లక్ష్మీనారాయణ ఎంపికయ్యారని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి అన్నారు. ఈనెల 23 నుంచి ఉత్తరప్రదేశ్‌లో జరగబోయే జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు లక్ష్మీనారాయణ ఎంపిక అయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణను, తీర్చిదిద్దిన క్రీడావిభాగాధిపతి డి.హేమచంద్రరావును హిందూహైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు అభినందించారు.

కమ్యూనికేషన్ వ్యవస్థతో దేశ ప్రగతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారతదేశం అద్భుతమైన ప్రగతిని సాధించేందుకు కమ్యూనికేషన్ రంగం అండగా నిలిచిందని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగ ప్రొఫెసర్ నాగిని అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం యాంటీనా టెక్నాలజీస్‌పై సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్, కోశాధికారి రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలి శాస్త్రి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.రంగారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తగ్గిన నిఘా పెరిగిన నేరాలు

- విజయవాడ రైల్వేస్టేషన్‌లో కొరవడిన తనిఖీలు
- పెరుగుతున్న నేరాలతో ప్రయాణికుల బెంబేలు
- జీఆర్‌పీలో వెంటాడుతున్న సిబ్బంది కొరత
- అంతంతమాత్రంగానే పోలీసుల పర్యవేక్షణ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దేశంలోనే అతి పెద్ద రైల్వే స్టేషన్‌లలో ఒకటిగా పేరుగాంచిన విజయవాడ రైల్వే స్టేషన్‌లో నేరాల సంఖ్య క్రమంగా పెరుగుతుండటం ప్రయాణికుల్లో ఆందోళన కలిగిస్తోంది. సాధారణ రోజుల్లో రోజూ 250 రైళ్లు, సుమారు లక్షన్నర మంది ప్రయాణికులు, పండుగ సెలవుల్లో దాదాపు మూడు లక్షల మంది వరకు రాకపోకలు సాగించే విజయవాడ రైల్వేస్టేషన్‌లో పోలీసుల నిఘా అంతంతమాత్రంగానే ఉంటోంది. దీంతో రైళ్లు, స్టేషన్ ప్లాట్‌ఫాంలు, పరిసర ప్రాంతాలలో నేరాల సంఖ్య కూడా పెరుగుతోంది. అప్పుడప్పుడు ప్రత్యేక డ్రైవ్‌ల పేరుతో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు విజయవాడ స్టేషన్‌లో కొన్ని రైళ్లు, ప్లాట్‌ఫాంలపై చేపట్టిన తనిఖీల్లో కొంత మంది నేరస్తులు చిక్కడంతో వారిని అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుంటున్నారు. ఇదే తరహా తనిఖీలను ప్రతి రోజూ చేపడితే తప్ప స్టేషన్‌లో నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టే అవకాశం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. మరో వైపు ప్రయాణికులే కాకుండా రైల్వే ఉద్యోగులకు స్టేషన్‌లో భద్రత కరువైంది. ఇటీవల డబ్బుల కోసం రైల్వే లోకోపైలట్‌పై దాడి చేసి హత్య చేసిన ఘటనతో స్టేషన్‌లో పోలీసు భద్రత డొల్లతనం మరోసారి బయటపడింది.



విజయవాడ స్టేషన్‌లో ప్రయాణికులను తనిఖీలు చేస్తున్న పోలీసులు (ఫైల్)

జీఆర్‌పీలో వెంటాడుతున్న సిబ్బంది కొరత

ప్రతి రోజూ లక్షలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే విజయవాడ స్టేషన్‌లో నేరాల నియంత్రణలో జీఆర్‌పీ పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. గంజాయి, మద్యం అక్రమ రవాణా, రైళ్లలో, స్టేషన్‌లో చోరీలు యథేచ్ఛగా జరుగుతుండటం అందుకు నిదర్శనం. దీనికి జీఆర్‌పీ (గవర్నమెంట్ రైల్వే పోలీసు) పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరతే కారణం. స్టేషన్‌లోని పది ప్లాట్‌ఫాంలు, రైళ్లు, స్టేషన్ పరిసర ప్రాంతాలలో తనిఖీలు చేసేందుకు సరిపడా సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఉన్న నలుగురు, ఐదుగురు సిబ్బందితోనే తనిఖీలు చేయిస్తున్నారు.

నిబంధనల ప్రకారం విజయవాడ జీఆర్‌పీ స్టేషన్‌లో 112 మంది సిబ్బంది ఉండాలి. వారిలో ఇద్దరు సీఐలు, ఏడుగురు ఎస్‌ఐలు, ఒక ఆర్‌ఎస్‌ఐ, ఒక ఏఎస్‌ఐ, 17 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 84 మంది కానిస్టేబుళ్లు ఉండాలి. కాని ప్రస్తుతం అందరు కలసి 42 మంది మాత్రమే ఉన్నారు. వారిలో వీక్లీ ఆఫ్‌లు, వ్యక్తిగత లీవ్‌లు, కోర్టు డ్యూటీలు, వీఐపీ ప్రొటోకాల్, సెంట్రీ విధులతో సగానికి పైగా వెళ్లిపోవడంతో ఉన్న అరకొర సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. గతంలో స్టేషన్‌లోని పది ప్లాట్‌ఫాంలతో పాటు అక్కడ నిలిచే ప్రతి రైలులో జీఆర్‌పీ సిబ్బంది తనిఖీలు చేపట్టేవారు. దీని కారణంగా నేరాలు సంఖ్య తక్కువగా ఉండేది. ముఖ్యంగా గంజాయి అక్రమ రవాణా చాలావరకు తగ్గిపోయింది. ప్రస్తుతం సిబ్బంది కొరత కారణంగా అన్ని రైళ్లు, ప్లాట్‌పాంలపై తనిఖీలు లేకపోవడంతో నేరాల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా రాత్రి సమయంలో ప్లాట్‌ఫాంలు, వెయిటింగ్ హాల్స్‌లో చార్జింగ్ పెట్టిన సెల్‌ఫోన్‌లు చోరీకి గురవుతున్నట్టు ఫిర్యాదులు ఎక్కువగా నమోదవుతున్నాయి. వీటిలో చాలావరకు ఫిర్యాదు చేయకుండానే వెళ్లిపోతున్నారు. రాత్రుళ్లు నిద్రిస్తున్న ప్రయాణికుల లగేజీ బ్యాగులు, మహిళల మెడలోని బంగారు ఆభరణాల చోరీ కేసులు కూడా పెరుగుతున్నాయి. గత ఏడాది విజయవాడ స్టేషన్‌లోనే ఒక వృద్ధురాలిపై దాడి, వెయిటింగ్ హాల్‌లో తల్లి పక్కన నిద్రిస్తున్న చిన్నారి కిడ్నాప్, స్టేషన్ పశ్చిమం వైపు గంజాయి బ్యాచ్ దాడులు, విధుల్లో ఉన్న ఉద్యోగులపై దాడులు, హత్యలతో విజయవాడ స్టేషన్ అంటేనే ప్రయాణికులు, ఉద్యోగులు హడలిపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత పోలీసు అధికారులు విజయవాడ జీఆర్‌పీకి తగినంత సిబ్బందిని కేటాయించి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



విజయవాడ జీఆర్‌పీ పోలీస్ స్టేషన్

ఏడాదికేడాదికి పెరుగుతున్న కేసులు...

సంవత్సరం	కేసులు
2022	317
2023	526
2024	308 (సెప్టెంబర్ వరకు)

పాతరాజరాజేశ్వరిపేట వాసులపై కూటమి దుర్మార్గ చర్య

పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాత రాజరాజేశ్వరి పేటలో ఇళ్లను ఖాళీ చేయాలంటూ రైల్వే శాఖతో కూటమి ప్రభుత్వం ఆదేశాలిప్పించటం దుర్మార్గమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పోతిన మహేష్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బుడమేరు వరద కారణంగా సర్వం కోల్పోయి నిరాశ్రయులైన వారిని ఈ ఆదేశాలు మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయని మండిపడ్డారు. వారిని ఖాళీ చేయించకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైల్వేకి ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయిస్తామని చెప్పిందని, స్థలాన్ని సైతం చూపించిందని గుర్తు చేశారు. రైల్వే అధికారులు దానిని తిరస్కరిస్తున్నారని చెప్పారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాల్సిన ఎంపీ చిన్ని, ఇతర ప్రజాప్రతినిధులు ఎక్కడున్నారని ప్రశ్నించారు.

2 నుంచి కార్తిక మాసోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో నవంబర్ 2వ తేదీ నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కార్తిక మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి తెలిపారు. ఉత్సవాలలో భాగంగా తొలి రోజు ఉదయం 5–30 గంటలకు గణపతి పూజ, స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహిస్తారన్నారు. సాయంత్రం 5 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఆకాశ దీపారాధన జరుగుతుందని, 4, 11వ తేదీల్లో కార్తీక సోమవారం, 12వ తేదీ చిలుక ఏకాదశి, 15వ తేదీ కార్తిక పౌర్ణమి, 18, 25 తేదీల్లో కార్తీక సోమవారం, 26న ఏకాదశి, 29న మాస శివరాత్రి, డిసెంబర్ 1వ తేదీ ఆదివారం కార్తిక అమావాస్యను పురస్కరించుకుని స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహిస్తామన్నారు. నవంబర్ 29వ తేదీ కార్తిక మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపార్చన జరుగుతుందని తెలిపారు.

విద్యార్థుల మేధస్సుకు పదును 'సాక్షి' స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ

- ఆంగ్ల భాషలో నైపుణ్యం పెంపుదలకు స్పెల్‌బీ
- గణితంలో పట్టు సాధించేందుకు మేథ్స్‌బీ
- ఉత్సాహంగా పాల్గొన్న నేతాజీ, సెయింట్ జాన్స్ విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులను ఆంగ్ల భాషలో ప్రావీణ్యులుగా, గణితంలో ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దేందుకు 'సాక్షి' మీడియా గ్రూప్ శుక్రవారం పశ్చిమ నియోజకవర్గంలోని గట్టు వెనుక ప్రాంతంలో గల పాఠశాలల్లో నిర్వహించిన స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ పరీక్షలు ఉత్సాహంగా జరిగాయి. నేతాజీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్పెల్‌బీ పరీక్షలో సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్రాంబే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో నిర్వహించిన మ్యాథ్స్‌బీ పరీక్షకు 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. 'సాక్షి' స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ పరీక్షలకు ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాఫీ, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరిస్తున్నాయి. ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులను నాలుగు కేటగిరీలుగా విభజించి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలను నేతాజీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కె.అరుణ కుమారి, సెయింట్ జాన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ కేవీ కల్యాణి పర్యవేక్షించారు. సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్స్ బీ పరీక్షలు విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టే విధంగా ఉన్నాయని వారు ప్రశంసించారు.



భవానీపురం సెయింట్ జాన్స్ స్కూల్లో సాక్షి మ్యాథ్స్ బీ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు



భవానీపురం నేతాజీ స్కూల్లో సాక్షి స్పెల్ బీ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

భయాన్ని పోగొట్టింది



గణితంలో లాజికల్ థింకింగ్‌తో పాటు పోటీ తత్వం పెంపొందించడంలో మ్యాథ్స్‌బీ ఎంతగానో ఉపయోగపడుతుంది. గణితంపై అవగాహన పెంపొందించడంతో పాటు భయాన్ని పోగొట్టింది.
– స్వార్థిక, 6వ తరగతి, సెయింట్ జాన్స్ పాఠశాల

స్పెల్‌బీపై ఆసక్తి పెరిగింది



సాక్షి స్పెల్‌బీ మొదటి సారిగా రాశాను. ఆంగ్లభాషలో గ్రామర్‌కు ఉన్న ప్రాధాన్యత తెలిసింది. వచ్చే ఏడాది కూడా మరింత ఉత్సాహంగా పాల్గొని ఇదే విధంగా రాస్తాను.
– ఎండీ జునైద్, 6వ తరగతి, నేతాజీ హైస్కూల్

భాషపై నైపుణ్యం పెంచుకునేందుకు..



ఇంగ్లిష్ భాషపై నైపుణ్యాన్ని పెంపొందించేందుకు స్పెల్‌బీ పరీక్ష దోహదం చేస్తుంది. ఇంగ్లిష్ వకాబ్యులరీలో అర్థాలు తెలుసుకునేందుకు చక్కటి అవకాశం ఈ పరీక్ష.
– కె.కుందన, 5వ తరగతి, నేతాజీ హైస్కూల్

గణితంపై పట్టు సాధించొచ్చు



గణిత శాస్త్రం అంటే భయపడే తరుణంలో ఈ మ్యాథ్స్‌బీ పరీక్ష ఆ భయాన్ని దూరం చేసింది. ఇటువంటి పరీక్షలు రాయడం వలన గణిత శాస్త్రంపై పట్టు సాధించేందుకు దోహపడింది.
– జశ్విన్, 7వ తరగతి, సెయింట్ జాన్స్ పాఠశాల

కాంట్రాక్ట్ వ్యవస్థను వ్యవస్థీకృతం చేస్తే పోరు తప్పదు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కాంట్రాక్ట్ వ్యవస్థను వ్యవస్థీకృతం చేస్తే పోరు తప్ప మరో మార్గం లేదని కార్మికనేత, కర్ణాటక హైకోర్టు న్యాయవాది బాలన్ అన్నారు. కాంట్రాక్ట్ వ్యవస్థను కాపాడడానికి, కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని, వీటిని లేబర్ కోడ్‌లు అనే కంటే డెకాయిటీ కోడ్‌లు అనడం సముచితంగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.వి జ్ఞాన కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఉభయ సంఘాల ఆధ్వర్యంలో ఉభయ సంఘాల రాష్ట్ర నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, ఏసు అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయవాది బాలన్ మాట్లాడుతూ మన్‌మోహన్ సింగ్ ప్రభుత్వంలో దోపిడీ సాగితే మోదీ ప్రభుత్వంలో బందిపోటు దోపిడీ సాగుతోందన్నారు.



మాట్లాడుతున్న బాలన్

ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో రెగ్యులర్ ఉద్యోగ, కార్మికుల సంఖ్య 15 శాతానికి తగ్గితే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సంఖ్య 85 శాతానికి పెరిగిందన్నారు. ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు పి.ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంక్ విధానాల ప్రయోగశాలగా మారుస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో సమరశీల ఐక్య ఉద్యమాల అవసరం ఎంతో ఉందన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.భారతి మాట్లాడారు. ఈ సందర్భంగా సదస్సులో పలు తీర్మానాలు ఆమోదించారు.

ఉచిత ఇసుకను వెంటనే అమలు చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ఇసుక మాఫియా రాజ్యమేలుతుందని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పశ్చిమ నగర కార్యదర్శి కె.శంకరయ్య అన్నారు. కూటమి పార్టీలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత ఇసుకను వెంటనే పంపిణీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మట్టి–లిఫ్ట్ కార్మిక యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో కొత్తపేట వాగు సెంటర్‌లో శుక్రవారం కార్మికులు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా ఇప్పటికీ ఉచితంగా ఇసుక ప్రజలకు అందుబాటులో లేకపోవడం బాధాకరమన్నారు. ఒక ట్రాక్టర్ ఇసుక ఏడువేల నుంచి ఎనిమిది వేల రూపాయలకు కొనాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇసుక మాఫియా అక్రమంగా ఇసుకను లాభాపేక్షతో అమ్ముకుంటోందన్నారు. ఇసుక అందక లక్షలాదిమంది నిర్మాణ కార్మికుల ఉపాధి దెబ్బతిని కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు కె.సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని వెంటనే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇ.వి.నారాయణ, సూరా శ్రీను, కనకారావు, లింగయ్య, వెంకట్రావు, రాజు, కృష్ణ, భద్రయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత ఇసుకను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

రైల్వే ఆస్పత్రిలో సోలార్ ప్లాంట్ ప్రారంభం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పర్యావరణ అనుకూల పద్ధతులలో భాగంగా సహజ ఇంధన వినియోగంలో మరో అడుగు ముందుకు వేసింది. రైల్వే హాస్పిటల్‌లోని అడ్మినిస్ట్రేషన్ భవనంలో శుక్రవారం నూతనంగా 60 కిలోవాట్స్ ఆన్–గ్రిడ్ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ పి.డి మిశ్రా డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో కలసి లాంఛనంగా దీనిని ప్రారంభించారు.

రూ.48.27 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టిన ఈ ప్లాంట్‌లో 120 ఆధునిక మోనో–క్రిస్టాలిన్ పర్స్ ప్యానల్స్ ఉపయోగించారు. వీటి ద్వారా ఏడాదికి 98,550 యూనిట్‌ల విద్యుత్ ఉత్పత్తి జరగటంతో హాస్పిటల్‌కు అవసరమైన విద్యుత్ అవసరాలు తీరనున్నట్లు డీఆర్‌ఎం తెలిపారు. పర్యావరణ హితంగా సహజ ఇంధన వినియోగంలో డివిజన్ కృషిని పి.డి. మిశ్రా ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు పి.ఇ.ఎడ్విన్, శ్రీనివాసరావు, రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ సారిబాల, అధికారులు పాల్గొన్నారు.



సోలార్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ పి.డి.మిశ్రా, పక్కన డీఆర్‌ఎం

పసికందు వైద్యానికి ఆర్థిక సాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): నెలలు నిండకుండానే పుట్టిన పసికందు వైద్య ఖర్చుల నిమిత్తం దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించింది. విద్యాధరపురం కబేళా సెంటర్‌లో నివసిస్తున్న మహేష్ ఆటో నడుపుకొంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గర్భిణీగా ఉన్న అతని భార్య కనకదుర్గకు ఏడో నెలలోనే ఒక పాపకు జన్మనిచ్చింది. చిన్నారి తీవ్ర అనారోగ్యంతో ఐసీయూలో చికిత్స పొందుతోంది. మహేష్ తన కుమార్తెకు వైద్యం చేయించే ఆర్థిక స్తోమత లేక దీవెన ఫౌండేషన్ (విజయవాడ సిటీ పోలీస్) సభ్యులను ఆశ్రయించారు. దీంతో ఫౌండేషన్ గ్రూప్ సభ్యుడు కానిస్టేబుల్ నాగేంద్రబాబు శుక్రవారం హాస్పిటల్‌కు వెళ్లి చిన్నారి తల్లిదండ్రులకు రూ.10వేలు నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా మహేష్, కనకదుర్గ దంపతులు ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రోన్ షో బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22, 23 తేదీలలో మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో డ్రోన్ సమ్మిట్–2024 నిర్వహించనుంది. అందులో భాగంగా 22వ తేదీ సాయంత్రం భవానీపురం పున్నమిఘాట్ (బబ్బూరి గ్రౌండ్)లో నిర్వహించనున్న డ్రోన్ షో, సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి బందోబస్తు ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర బాబు శుక్రవారం ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. పున్నమిఘాట్, భవానీఘాట్ పరిసర ప్రాంతాలను పరిశీలించి వీఐపీ గ్యాలరీతోపాటు పబ్లిక్ గ్యాలరీ తదితర గ్యాలరీల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవల్సిన భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమానికి హాజరయ్యే డెలిగేట్స్, వీవీఐపీలు, సామాన్య ప్రజలు డ్రోన్ షో, సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే వారి వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పటిష్ట బందోబస్తు నిర్వహించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పున్నమిఘాట్‌లో ఏర్పాట్లకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

పోలీస్ అమరవీరుల సంస్మరణ వేడుకల ఏర్పాట్ల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): ఈ నెల 21న నగరంలో జరిగే పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో వీఎంసీ కల్పించే ఏర్పాట్లలో ఎలాంటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం, ఎంజీ రోడ్డులో పర్యటించి పోలీస్ అమరవీరుల సంస్మరణ దిన వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. అక్టోబర్ 21న జరిగే వేడుకల ఏర్పాట్లకు అవసరమైన పార్కింగ్, గ్రౌండ్ అరేంజ్‌మెంట్స్, పెరేడ్ మార్కింగ్ ట్రాక్స్, తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లను పరిశీలించారు. వేడుకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూసుకునేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డి.చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్, టి.శ్రీనివాస్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ డాక్టర్ సురేష్ బాబు, ఇంజినీరింగ్ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

ఉచిత ఇసుక అందించాలి : సీఐటీయూ

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక సరఫరాను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేపట్టాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ పశ్చిమ నగర కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం భవానీపురం లోని ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయంలో ఆయన సిబ్బందికి ఈ మేరకు యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ)జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.నరసింహారావు, అప్పారావు, పశ్చిమ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం పలువురు చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన శ్రీసాయి సంగీత నృత్య అకాడమీకి చెందిన చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ జీవితంలో ధ్యానాన్ని ఓ భాగం చేసుకోవాలని దుర్గగుడి ఈవో కె.ఎస్.రామరావు అన్నారు. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో మహా మండపం ఆరో అంతస్తులో శుక్రవారం అఖండ ధ్యాన యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ధ్యానంలో పాల్గొన్న వారికి అమ్మవారి దర్శనం కల్పించారు.